క్లుప్తంగా

బీరే గోవిందుకు ఘన నివాళి



బీరే గోవిందు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: పట్టణానికి చెందిన జర్నలిస్టు, పద్మాలయ ఫొటో స్టూడియో నిర్వాహకులు, తొగట వీరక్షత్రియ సంఘం నాయకులు బీరే గోవిందు (52) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్ గోవిందు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ.. గోవిందుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

కామర్స్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కంబదూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ లెక్చరర్ పోస్టుకు గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ చిక్కా బొమ్మప్ప బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టుకు పోస్ట్ గ్రాడ్యుయేషన్ (ఎంకాం)లో 50 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఈనెల 25వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

వరలక్ష్మీ నమోస్తుతే



పూజలందుకుంటున్న నేసేపేటలోని వరమహాలక్ష్మీ దేవి

రాయదుర్గంటౌన్: శ్రావణమాసం అంటేనే శుభప్రదం, ప్రత్యేకం. మహిళలకు మంగళ, శుక్రవారాలు ప్రత్యేకమైనవి. వరలక్ష్మీ వ్రతం అంటే మహిళల పండుగ. సాంప్రదాయం ఉట్టిపడే ఈ రోజుల్లో ప్రతి ఇల్లు ఒక దేవాలయంలా మెరిసిపోతుంది. వరలక్ష్మీ దేవి భక్తులు కోరిన వరాలను ప్రసాదిస్తుందని, భక్తుల కోరికలను తీరుస్తుందనే నమ్మకం. ఈ నెల 25న శుక్రవారం వరలక్ష్మీ వ్రతం జరుపుకునేందుకు అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని ప్రముఖ ఆలయాలతో పాటు అమ్మవారి ఆలయాల్లో శ్రావణ మాసం పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. వాసవీమాత ఆలయం, నేసేపేట, కళ్లీమఠం హైస్కూల్ వద్ద గల మహాలక్ష్మీ ఆలయం, 8వ వార్డులోని శ్రీలక్ష్మీ సత్యనారాయణ స్వామి ఆలయాల్లో మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించనున్నారు. శుభ కార్యాలయాలకు వస్తువులు, వస్త్రాల కొనుగోళ్లతో మార్కెట్ కిటకిలాడుతోంది. చిరు వ్యాపారస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మల్బరీ సాగుతో లాభాలు



మాట్లాడుతున్న సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉషవర్ధిని

బ్రహ్మసముద్రం: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో బుధవారం పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద వైఎస్సార్ పట్టు బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల సెరికల్చర్ ఆఫీసర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ.. పట్టుపరిశ్రమ శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాలు, అందజేస్తున్న రాయితీలపై వివరించారు.అనంతరం కళ్యాణదుర్గం సెరికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉషవర్ధిని మాట్లాడుతూ.. మల్బరీ సాగులో నూతన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. మల్బరీ ద్వారా స్థిరమైన ఆదాయం పొందే మార్గాలను రైతులకు క్షుణ్ణంగా వివరించారు. రైతులు ప్రభుత్వ రాయితీలను సక్రమంగా ఉపయోగించుకుని మల్బరీ సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రభావతి, టెక్నికల్ అసిస్టెంట్లు గంగులప్ప, అక్బర్, వీఎస్ఏ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళకు అస్వస్థత



చికిత్స పొందుతున్న భాగ్యమ్మ

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లిలో డి.భాగ్యమ్మ అనే మహిళ తన వ్యవసాయ పొలంలో వేరుశనగ పంట తొలగిస్తుండగా పాముకాటుకు గురైంది. గడ్డిలో దాగి ఉన్న రక్తపింజర భాగ్యమ్మ చేతిపై కాటు వేసింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హుటాహుటిన బ్రహ్మసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చేయించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

అంబరం.. సంబరం

దేశ అంతరిక్ష రంగంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. 40 రోజులుగా యావత్ భారతదేశంలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. జాబిల్లిపై అన్వేషణ కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్–3 ప్రయోగం విజయవంతమైనట్లు బుధవారం సాయంత్రం ఇస్రో శాస్త్రవేత్తలు ప్రకటించారు. దీంతో రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ప్రాంతాల్లో పలువురు మిఠాయిలు పంచిపెట్టారు. పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.



రాయదుర్గంలో సంబరాలు చేసుకుంటున్న కళాశాల విద్యార్థులు

ఇస్రో అంచనాలు తప్పలేదు..



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో చరిత్ర సృష్టించింది. చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంలో ల్యాండ్ అయిన మొదటి దేశంగా భారతదేశం నిలవడం గర్వకారణం. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చంద్రయాన్–3లో ఎటువంటి లోపాలు లేకుండా తీర్చిదిద్దడంతో ఈ సారి ప్రయోగం విజయవంతంమైంది.– బద్దె నాయక్, ఉపాధ్యాయుడు

- చంద్రయాన్–3 విజయంపై హర్షాతిరేకాలు
- పలుచోట్ల విద్యార్థుల ర్యాలీ

రాయదుర్గం/ రాయదుర్గం టౌన్/ఉరవకొండ: చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ వాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బుధవారం 500 మీటర్ల జాతీయ జెండాతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పట్టణంలో జాతీయ భావం వెల్లివిరిసింది. శాంతినగర్‌లోని పాఠశాల వద్ద నుంచి బళ్లారి రోడ్డు, వినాయక సర్కిల్, పాత బస్టాండ్, లక్ష్మీబజార్ మీదుగా కణేకల్లు రోడ్డు నందు గల జూనియర్ కళాశాల వరకు ర్యాలీ చేపట్టి జయహో భారత్, చంద్రయాన్ విజయవంతం కావాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

- చంద్రుడిపైకి చంద్రయాన్–3 విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా చేరుకోవడంపై జయహో భారత్ అంటూ రాయదుర్గం పట్టణంలోని వినాయక సర్కిల్‌లో బుధవారం సాయంత్రం కళాశాల విద్యార్థులు, పట్టణ ప్రముఖులు, వివిధ సంఘాల నాయకులు సంబరాలు చేసుకున్నారు. బాణ సంచా పేల్చి, స్వీట్లు పంపిణీ చేసుకుని సంతోషం వ్యక్తం చేశారు. చంద్రయాన్ విజయవంతం కావడం చరిత్రలో నిలిచిపోయే రోజు అన్నారు. భారతదేశంలోని ప్రతి పౌరుడు గర్వపడేలా దేశ ఖగోళ శాస్త్రవేత్తల కృషి అభినందనీయమన్నారు.



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

అరుదైన ఘట్టం




అనుకుంటే సాధించలేనిది ఏదీ లేదనేందుకు చంద్రయాన్–3 విజయం నిదర్శనం. జాబిల్లిపై అన్వేషణ కోసం ఇస్రో జరిపిన పరిశోధన విజయవంతం కావడం ప్రపంచ దేశాలకే ఆదర్శం. యువతరం స్ఫూర్తిగా తీసుకోవాలి. ఈ సరికొత్త రికార్డును ప్రతి ఒక్కరు గుర్తించాలి. శాస్త్ర సాంకేతిక రంగంలో ఇదో అరుదైన ఘట్టంగా చెప్పుకోవచ్చు.
– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం డివిజన్

ప్రజల ఆకాంక్ష నెరవేరింది



140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్ష నెరవేరింది. ఎలాంటి అడ్డంకులు లేకుండా చంద్రయాన్ ప్రయోగం విజయవంతం కావడం ప్రతి భారతీయుడికీ గర్వ కారణం.
– కె.సీ అరుణ, రసాయశాస్త్ర అధ్యాపకురాలు, ఉరవకొండ

భారత్ చరిత్ర సృష్టించింది



అతి తక్కువ బడ్జెట్‌తో ఎన్నో దేశాలకు సాధ్యం కాని విజయాన్ని భారత్ అందుకొని చరిత్ర సృష్టించింది. చంద్రయాన్–3 విజయవంతం కావడంతో యూఎస్ఏ, చైనా లాంటి అగ్రదేశాల సరసన భారత్ కూడా నిలిచింది.
– నాగమల్లి ఓబులేసు, జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఉరవకొండ

త్వరితగతిన సర్వే పూర్తవ్వాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఓటరు సవరణ ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టి ఈ నెల 25లోపు పూర్తి చేయాలని తహసీల్దార్ శేషారెడ్డి బూత్‌లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ)కు ఆదేశించారు. బుధవారం ఓటరు సవరణపై జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తర్వాత ఆయన బీఎల్ఓలతో ఓటరు సవరణపై సమీక్షించారు. ఏకపక్షంగా సర్వే చేయకుండా రాజకీయ పార్టీల ఏజెంట్లను వెంటబెట్టుకొని ఇంటింటా సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ లక్ష్మీదేవి, ఆర్ఐలు ప్రసన్నకుమార్, విజయకుమార్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

'న్యాయం చేయండి'

కణేకల్లు: 'జగనన్న కాలనీ'లో అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్న నవీన్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు బుధవారం రాత్రి కణేకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యర్రగుంట గ్రామ శివారులో 272 సర్వే నంబర్‌లో మూడేళ్ల క్రితం జగనన్న లే అవుట్ వేసి 110 మందికి అధికారులు పట్టాలను పంపిణీ చేశారు. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. అయితే, నవీన్‌కుమార్ అనే వ్యక్తి భూమి తనదంటూ కోర్టును ఆశ్రయించాడు. ఇళ్లు నిర్మించుకొంటున్న వారికి ఇబ్బందులు కల్గిస్తున్నాడు. మోటార్ వైర్ తొలగించడం, సామగ్రి తరలించకుండా అడ్డుకొంటున్న నవీన్ బుధవారం మురళి అనే వ్యక్తికి చెందిన ఇంటిగోడలను కూల్చేసి ఇకపై ఎవరైనా నిర్మాణాలు చేస్తే ఇదేగతి పడుతుందని హెచ్చరించాడు. దీంతో లబ్ధిదారులు రాత్రి పోలీసుస్టేషన్‌కు వచ్చి అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఎస్ఐ దుగ్గిరెడ్డి నవీన్ కుమార్‌ను పోలీసుస్టేషన్‌కు పిలిపించి విచారణ చేశారు. కోర్టు నుంచి స్పష్టమైన ఉత్తర్వులు వచ్చే వరకు లబ్ధిదారులను ఇబ్బందులు కల్గించవద్దని సూచించారు.

గురుకులం ఎదుట విద్యార్థి సంఘాల నిరసన

ఉరవకొండ: ఉరవకొండ గిరిజన గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని సుస్మితను అనారోగ్యం కారణంతో బయటకు పంపేసిన సంఘటనపై ఈనెల 22న 'సాక్షి'లో కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. దీనిపై దళిత, గిరిజన సంఘాలతో పాటు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఉదయం జీవీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు శివశంకర్‌నాయక్, గిరిజన సంఘం సీనియర్ నాయకులు సుబ్రమణ్యం నాయక్, దళిత, గిరిజన హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు మీనుగ గోపాల్, జిల్లా అధ్యక్షులు ధనంజయ, రాష్ట్రకార్యదర్శి సాకేపురుషోత్తం, బీజేవైం నాయకులు సురేష్, ఎమ్మార్‌సీఎస్ నాయకులు పృథ్వీరాజ్, ఆర్ఎస్‌యూ నాయకులు భీమేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు సింహాద్రినాయక్, దశరథ్‌నాయక్ పాఠశాల ప్రిన్సిపాల్ అరుణదేవిని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినిని బయటకు గెంటేయలేదని ఆరోగ్యం బాగైన తరువాత రమ్మని చెప్పామన్నారు.

అధికారుల ఆదేశాలు తప్పనిసరిగా పాటించాలి

రాయదుర్గం రూరల్: రాష్ట్ర, జిల్లా ఎన్నికల అధికారుల ఆదేశాలను నియోజకవర్గ స్థాయి, బూత్ లెవెల్ అధికారులు తు.చ. తప్పకుండా పాటించాలని రాయదుర్గం ఏఈఆర్ఓ, తహసీల్దార్ మారుతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జిల్లా కలెక్టర్‌తో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం, ఆయన బూత్ లెవెల్, మండల స్థాయి ఎన్నికల అధికారులతో మాట్లాడారు. మార్పులు, చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు కార్యక్రమంలో నిబంధనలు పాటించి తీరాలన్నారు. తప్పిదాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో గుమ్మఘట్ట ఏఈఆర్ఓ బ్రహ్మయ్య, రాయదుర్గం ఈడీటీ సుజాత, సూపర్‌వైజర్లు జీవన్, నారాయణ స్వామి, మండలపరిషత్ ఏఓ చిక్కణ్ణ, బూత్‌లెవెల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వివాహిత మృతి

గుమ్మఘట్ట: విద్యుత్ షాక్‌కు గురై ఓ వివాహిత మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన గంగాధర్, మహాలక్ష్మి (37) దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని గంగధార్ పోషించుకుంటున్నాడు. బుధవారం ఉదయం మిద్దెపై ఉన్న ట్యాంక్‌లో నీళ్లు అయిపోవడంతో మహాలక్ష్మి వెళ్లి మోటార్ స్విచ్ ఆన్ చేసింది. ఆ సమయంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా షాక్ గురై అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్హులందరికీ 'సంక్షేమం'



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

గుమ్మఘట్ట: కులమతాలు, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తెలిపారు. మండలంలోని గొల్లయ్యదొడ్డి, ఎస్.కె.దొడ్డి, పైదొడ్డి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ హేమక్క, ఎంపీటీసీ పరమేశ్వర, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు గౌని కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందుతో కలిసి బుధవారం ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్‌లను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచం మెచ్చేలా సీఎం జగన్ పాలన అందిస్తుండడంతో ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. పైసా లంచం లేకుండా, గడపవద్దకే సంక్షేమ పథకాలు అందిస్తుండడంతో దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు మన రాష్ట్రం వైపు చూసేలా పాలన అందిస్తూ అందరి మన్ననలు పొందుతుండడంతో టీడీపీ నేత చంద్రబాబుకు నిద్రపట్టడం లేదన్నారు. 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకునే బాబుకు దిమ్మతిరిగే పాలన అందిస్తుండడంతో ప్రజల వద్ద నుంచి వస్తున్న ఆదరణను చూసి తట్టుకోలేకపోతున్నారని తెలిపారు. టీడీపీ నాయకుల రాక్షసపాలన నుంచి విముక్తి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని విప్ తెలిపారు. కంత్రీ రాజకీయాలు చేయడంలో కాలువ మించిపోయాడని ధ్వజమెత్తారు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లను నిర్మించుకుంటుంటే కాలువ మాత్రం నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ ప్రజలలో చులకన అవుతున్నాడని ఎద్దేవా చేశారు. టీడీపీని నమ్మితే జీవితాలు బుగ్గిపాలు కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సురేశ్‌బాబు, ఆర్ఐ చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్,సర్పంచులు రమేష్, ఉమేష్‌రెడ్డి, అనిల్, వైస్ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, ఎంపీటీసీ గోవిందు, సచివాలయాల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, వైస్ సర్పంచ్ పాలయ్య,కాంట్రాక్టర్ కాంతారెడ్డి, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు నాగిరెడ్డి, నాయకులు సిద్దప్ప, ఈరన్న, బాగన్న, మెకానిక్ బాష,గొల్ల వన్నూరస్వామి, బోరయ్య, కురుబ ప్రకాష్, దొడగట్ట వన్నూరుస్వామి, ఈశ్వరప్ప, గొల్ల సంతోష్, నాగరాజు, శివప్రకాష్, ఓంకార్, డీలర్ పాలయ్య, సురేష్, రవి, ఎర్రిస్వామి, రామన్న, బన్నీ, ఖాజాహుస్సేన్, చిత్రశేఖరప్ప, అనుమేష్‌తదితరులు పాల్గొన్నారు.

రైతుల కళ్లలో ఆనందం

గుమ్మఘట్ట: రైతుల కళ్లలో ఆనందం చూడాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని భూపసముద్రం గ్రామ సమీపంలోని గంధవీడి తిప్పేస్వామి రైతు పొలంలో గ్రామసర్పంచ్ అనిల్, జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్‌తో కలిసి వైఎస్సార్ జల కళను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకునేలా పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు తెలిపారు. జలకళకు రూ. 2,340 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. మోటార్ల కోసం 1,600 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా ఏపీడీ జయకుమార్‌బాబు ,ఏపీడీ అసిస్టెంట్ దేవరాజు,ఏపీఓ సురేష్, రైతు గంధవీడి తిప్పేస్వామి, బేలోడు సర్పంచ్ ఉమేష్‌రెడ్డి, కాంట్రాక్టర్ ఆర్డీ కాంతారెడ్డి, జయరామిరెడ్డి, శ్రీపతి, గంధవీడి హంపన్న, డీలర్ అంజి, సవారప్ప, వన్నూరుస్వామి, అనుమేష్, కసందుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమిపూజ



జోగి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీ రంగయ్య, మాజీ ఎమ్మెల్యే విశ్వ

ఉరవకొండ: స్థానిక శివరామిరెడ్డి కాలనీలో రూ.50 లక్షలతో జోగి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి బుధవారం ఎంపీ తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ, మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ అత్యంత వెనుకబడిన సంచార జాతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సంచార జాతుల వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడుగు, బలహీన వర్గాల వారి కోసం సీఎం అహర్నిషలూ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంబీసీ, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్లు జోగి వెంకటేష్, గోవిందు, సర్పంచ్ లలితమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, పీఆర్ డీఈ అరుణ్‌కుమార్, , జేఈ మధు, మాజీ జెడ్పీ సభ్యులు తిప్పయ్య, ఎంపీటీసీ మల్లిక పాల్గొన్నారు.

టీడీపీ కనుమరుగు ఖాయం

ఉరవకొండ: 2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ కనుమరుగు కావడం ఖాయమని రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జేసీఎస్ కన్వీనర్లు తేజోనాథ్, ఆసీఫ్, వెంకటరెడ్డి, భరత్ రెడ్డి, శ్రీనివాసులుతో పాటు సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విశ్వ మాట్లాడుతూ నియోజకవర్గంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతో విజయవంతం అయిందన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు మరింత బాధ్యతగా పని చేసి ఉరవకొండలో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరేలా చేయాలన్నారు.

కోతల్లేకుండా విద్యుత్ సరఫరా చేయండి

ఉరవకొండ: రైతులకు ప్రభుత్వం అందిస్తున్న 9 గంటల విద్యుత్ సరఫరా సమయంలో కోతల్లేకుండా ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిరంతారయంగా విద్యుత్ అందించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ సురేంద్రబాబుని కోరారు. బుధవారం హైదరాబాద్ నుంచి ఫోన్‌ద్వారా ఎస్ఈతో మాట్లాడినట్లు ఆయన 'సాక్షి'కి తెలిపారు. విద్యుత్ కోతలు ఎక్కవగా ఉన్నాయని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారని, ఈయేడాది వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్ఈకి వివరించారు. రైతుల ఇబ్బందులు గుర్తించి హంద్రీనీవాకు త్వరగా నీరు విడుదల అయ్యేలా కృషి చేశామన్నారు. కనీసం ఆ నీటిపై ఆధారపడి పంటలు సాగు చేసుకొనే రైతుల సౌకర్యార్థం 9 గంటల పాటు నిరంతరాయ విద్యుత్ అందించాలన్నారు. విద్యుత్ కోతలు లేకుండా రైతులు సాగుచేసే పంటలు దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పేదలకు వైఎస్సార్ బీమా అండ

గుమ్మఘట్ట: వైఎస్సార్ బీమాతో నిరుపేదలకు కొండంత అండ లభిస్తుందని సర్పంచ్ రమేష్ తెలిపారు. మండలంలోని కె.పి.దొడ్డి గ్రామం మాజీ సర్పంచ్ నాగప్ప (44) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. తక్షణ సహాయం కింద రూ. 10 వేలను మృతుని భార్య బసమ్మకు గ్రామ సర్పంచ్ రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్వేతపద్మిని బుధవారం అందించారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవింద, వైస్ సర్పంచ్ రమేష్, ప్రభుత్వ పాఠశాల కమిటీ ఛైర్మన్ రమేష్, డిజిటల్ అసిస్టెంట్ చిత్తప్ప, సచివాలయ కన్వీనర్ చంద్ర, అడిగుప్ప రాజేష్, వార్డు మెంబర్ పెన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

రాయదుర్గంటౌన్: పట్టణంలోని పైతోటలో నివాసం ఉంటున్న ఎస్.మమత అనారోగ్యంతో మృతి చెందగా వైఎస్సార్ బీమా కింద తక్షణ సాయం రూ.10 వేలను బుధవారం అందజేశారు. వార్డు కౌన్సిలర్ పైతోట సంజీవప్ప బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందించారు.

చిత్తశుద్ధితో పని చేయండి

విడపనకల్లు: అంకితభావం, చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ కరణం పుష్పావతి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని కరముక్కల, హావళిగి గ్రామాల్లో ఉన్న సచివాలయాలను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎంపీపీ సందర్శించారు. ఉద్యోగుల తీరు మారకపోతే కలెక్టర్‌ను కలసి చర్యలు తీసుకునే విధంగా చూస్తామని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ మాజీ సర్పంచు భీంరెడ్డి, కరకముక్కల సర్పంచు రామాంజనరెడ్డి, రఘురాం,ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు మంత్రి ఉషశ్రీచరణ్ పర్యటన

కుందుర్పి: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పర్యటించనున్నారని పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి తెలిపారు. ఉదయం 10 గంటలకు అపిలేపల్లిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, 11 గంటలకు కుందుర్పిలో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, మధ్యాహ్నం 12 గంటలకు మలయనూరులో రైతు భరోసా కేంద్రాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

భూసమస్య పరిష్కరించండి

బెళుగుప్ప: తమకు చెందిన భూమిని ఇతరులు పాసు పుస్తకాల్లోకెక్కించుకున్నారని, తమకు న్యాయం చేయాలంటూ గంగవరం గ్రామానికి చెందిన అరుణమ్మ, ఎర్రిస్వామి దంపతులు బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో బైఠాయించి నిరసన తెలిపారు. తహసీల్దార్ ఓబులేసును 'సాక్షి' వివరణ కోరగా సమస్య ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని, సర్వే అధికారులు అందించిన సాగు అనుభవ పత్రాలను రద్దు చేస్తామన్నారు.

ఆహార భద్రత నియమాలు పాటించాలి

శెట్టూరు: ఆహార నాణ్యత, భద్రత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని తహసీల్దార్ ఫణికుమార్ సూచించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల ఆహార భద్రత సలహా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎంపీపీ లక్ష్మీదేవి మాట్లాడుతూ.. మండలంలో లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ అందించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఎంఈఓ శ్రీధర్, సీఎస్‌డీటీ విజయలక్ష్మి, ఎంపీడీఓ రఘురామరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి

కణేకల్లు: కణేకల్లు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను రెండో రోజు బుధవారం కూడా యర్రగుంట గ్రామ రైతులు ముట్టడించారు. ఇన్‌చార్జ్ ఏడీ గురురాజ్, రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్, ఎస్ఐ దుగ్గిరెడ్డి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు చేరుకొని రైతులకు సర్దిచెప్పారు. కోతల్లేకుండా కరెంటు సక్రమంగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకొంటామని ఏడీ హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

ఫుడ్ సెక్యూరిటీ నూతన కమిటీ ఏర్పాటు

బెళుగుప్ప: ఫుడ్ సెక్యూరిటీ మండల నూతన కమిటీని 26 మంది సభ్యులతో ఏర్పాటు చేశారు. తహసీల్దార్ ఓబులేసు అధ్యక్షుడిగా బుధవారం ఏర్పాటు చేసి తొలి సమావేశాన్ని తహసీల్దార్ కార్యాలయంలోనే నిర్వహించారు. ప్రధానంగా చౌకదుకాణాల్లో నిత్యావసరుకుల పంపిణీ లోటుపాట్లు, సమస్యలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన ప్రక్రియ, సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార వ్యవస్థలపై చర్చించారు.

ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు

కూడేరు: తాము సాగించిన పంటను ఈ–క్రాప్ నమోదు చేయడంలో అధికారులు సహకరించడం లేదంటూ రైతుల నుంచి ఫిర్యాదులు అందితే సంబంధిత అధికారులపై శాఖాపరమైన తీసుకుంటామని వ్యవసాయాధికారులను ఆ శాఖ జిల్లా అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. బుధవారం కూడేరులోని రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. పంటల నమోదుపై ఆరా తీశారు.

ఉరవకొండ: లత్తవరం గ్రామంలో జరుగుతున్న ఈపంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి ఉమామహేశ్వరమ్మ పరిశీలించారు. ఏఓ శుభకర్‌తో కలిసి గ్రామానికి చెందిన వంకలపాటి దేవేంద్రప్ప అనే రైతు పొలంలో కంది పంట నమోదును సిబ్బంది గోపాల్‌నాయక్‌తో చేయించారు. వజ్రకరూరు మండలం రాగులపాడులో పంట నమోదును పరిశీలించారు.

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం

కూడేరు: గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించే నిధులతో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. బుధవారం గొటుకూరులో రూ.5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. పీఆర్ ఏఈ శ్రీనివాసులు నిర్మాణపు పనులను పరిశీలించారు.

సబ్‌స్టేషన్‌తో లోఓల్టేజీకి చెక్

కూడేరు: 132/33 కేవీ ఈహెచ్‌టీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటైతే పలు గ్రామాల్లో లో–ఓల్టేజి సమస్యను అధిగమించవచ్చని ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర,డిస్కాం ఎస్ఈ కరుణాకర్ అన్నారు. 132/33 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటుకు బుధవారం కూడేరు మండల పరిధిలోని కరుట్లపల్లి వద్ద సర్వేనంబర్ 167లో గల 5 ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. సబ్‌స్టేషన్ ఇక్కడ ఏర్పాటైతే వ్యవసాయ మోటర్లకు, గృహాలకు లోఓల్టేజీ లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ గౌస్ పీరా, ఆర్ఐ ప్రసన్న కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.